రేపు పెన్షనర్ల ధర్నాలు

ధర్మవరం/కదిరి అర్బన్, జనవరి 23: సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు ఆ సంఘం నేతలు చలపతి, ఆత్మారెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనిని నిరసిస్తూ 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ధర్నాలు చేపడతామన్నారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫలించని రాయబారం

కదిరి వైసీపీలో తొలగని అసమ్మతి
పెద్దిరెడ్డికి దూరంగా 14 మంది కౌన్సిలర్లు
చైర్‌పర్సన్‌ను మార్చాల్సిందేనంటూ పట్టు

కదిరి, జనవరి 23: అధికార పార్టీలో అసమ్మతి తొలగట్లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పుతో రేగిన అసమ్మతిని చల్లార్చేందుకు పార్టీ పెద్దలు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. పార్టీకి దూరంగా ఉన్నవారిని సమన్వయ పరచడానికి జోనల్ ఇన్‌చార్జి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేస్తున్న రాయబారం ఫలించలేదని తెలుస్తోంది. మున్సిపాలిటీలోని దాదాపు 14 మంది కౌన్సిలర్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలవకుండా దూరంగా ఉన్నట్లు సమాచారం. నాలుగు రోజుల క్రితం మంత్రి కదిరిలో పర్యటించారు. మంగళవారం మరోసారి వచ్చారు. ఆ 14 మంది కౌన్సిలర్లు మాత్రం మంత్రిని కలవకుండా దూరంగా ఉన్నట్లు సమాచారం. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని వైసీపీ ఇన్‌చార్జిగా మగ్బుల్‌ను అధిష్ఠానం ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయంపై ఎమ్మెల్యే వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కదిరి మున్సిపాలిటీలోని 30 మంది అధికార పార్టీ కౌన్సిలర్లలో 14 మంది అసమ్మతితో రగిలిపోతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషా కుటుంబానికి చెందిన మగ్బుల్‌ను నూతన ఇన్‌చార్జిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒకే కుటుంబానికి రెండు పదవులు ఇవ్వడం ఏంటని అధిష్ఠానాన్ని నిలదీస్తున్నారు. మగ్బుల్‌ను ఇన్‌చార్జిగా కొనసాగించాలనుకుంటే చైర్‌పర్సన్‌నైనా మార్చాలని అసమ్మతి కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి వారికి సర్దిచెప్పేందుకు కదిరికి వచ్చారు. మంత్రి తరఫున కళాకారుల కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం రాయబారం సాగించారు. అసమ్మతి కౌన్సిలర్లతో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. వారు తమ డిమాండ్లను వైసీపీ అధిష్ఠానం ముందు పెట్టినట్లు తెలిసింది. చైర్‌పర్సన్‌ను మార్చితేనే తాము పార్టీ కోసం పనిచేస్తామని తేల్చి చెప్పినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ఇలా వ్యవహరించడం సరికాదనీ, ఎన్నికల తరువాత డిమాండ్లు నేరవేరుస్తామని నాగభూషణం చెప్పినా, కౌన్సిలర్లు ససేమిరా అన్నట్లు సమాచారం. మూడుగంటలపాటు కౌన్సిలర్లతో చర్చలు జరిపినా ఆయన రాయబారం ఫలించలేదని తెలుస్తోంది. మంత్రి పర్యటన సందర్భంగా పట్టణంలో ఆ 14 మంది కౌన్సిలర్లు ఎక్కడా కనిపించలేదని తెలుస్తోంది.



సమావేశమైన అసమ్మతి కౌన్సిలర్లు (ఫైల్)

రెండోసారీ ఎమ్మెల్యే దూరం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండోసారి కదిరిలో పర్యటిస్తున్నా వైసీపీకే చెందిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి దూరంగా ఉన్నారు. మంత్రి వస్తున్నారని తెలిసినా, ఎమ్మెల్యే అందుబాటులో లేకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆయన వర్గీయులు కూడా ఎవరూ కనిపించలేదు. స్థానికంగా ఉన్న పలువురు కౌన్సిలర్లతో పాటు మాజీ, ప్రస్తుత వైసీపీ పట్టణాధ్యక్షులు కూడా దూరమైనట్లు సమాచారం. మండలాల్లో ఉన్న పలువురు ప్రజాప్రతినిధులు కూడా మంత్రిని కలవలేదని తెలుస్తోంది. ఈ పరిణామాలు వైసీపీలోని ఓ వర్గానికి మింగుడు పడట్లేదు. అసమ్మతి నేతలతో మాట్లాడేందుకు మంత్రి పెద్దిరెడ్డి త్వరలో మరోసారి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు సమాచారం.





రైతు ప్రభుత్వం అంటే ఇదేనా..?

అన్నదాతల గోడు ముఖ్యమంత్రికి పట్టదా?
వారమైనా చలనమేదీ?
పట్టు రైతులు, రీలర్ల మండిపాటు
పట్టుగూళ్లతో నిరసన



పట్టుగూళ్లతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు, రీలర్లు


హిందూపురం, జనవరి 23: రైతు ప్రభుత్వం అంటే ఇదేనా అంటూ ముఖ్యమంత్రి జగన్‌ను పట్టు రైతులు, రీలర్లు ప్రశ్నించారు. పట్టు రైతులు, రీలర్లకు రావాల్సిన ప్రోత్సాహకం విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 17 నుంచి పట్టుగూళ్ల మార్కెట్‌ను బంద్ చేసి, నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. రోజూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ పట్టు రైతుల సంఘం, రీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులో పట్టుగూళ్ల మార్కెట్ ముందు బైఠాయించి, ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. రైతులను ఆదుకునే ప్రభుత్వం తమదేనంటూ గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పట్టు రైతులు, రీలర్లు చేస్తున్న సమ్మె కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క నెలైనా రైతులు, రీలర్లకు ప్రోత్సాహకం ఇచ్చారా అంటూ నిలదీశారు. రైతులను ఆదుకునేది ఇలాగేనా అని ప్రశ్నించారు. పెట్టుబడులు పెరిగిపోయి రైతులు నష్టాల పాలవుతుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు కూడా ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రతినెలా వేల కోట్ల రూపాయలు పంచడానికి బటన్ నొక్కే ముఖ్యమంత్రికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టు రైతులు, రీలర్లకు రూ.70కోట్లు ఇవ్వడానికి చేతకావట్లేదా, చేతులు రావట్లేదా అంటూ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టు రైతు సంఘం నాయకులు సోమకుమార్, నర్సేగౌడ్, సిద్దారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివశంకర్, రీలర్ల అసోసియేషన్ నాయకులు ఖలీల్, ముస్తఫా, అన్సార్, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, జయరాంరెడ్డి, సీపీఐ వినోద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం: యూటీఎఫ్

కదిరి, జనవరి 23: పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) సాధనే లక్ష్యమని యూటీఎఫ్ నేతలు ఉద్ఘాటించారు. పట్టణంలో మంగళవారం పది మండలాల నాయకులు సమావేశమయ్యారు. ఆ సంఘం నేత శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 28న చలో రాజమండ్రి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

ఆసరా సొమ్ము విడుదల

పుట్టపర్తి, జనవరి 23: జిల్లాలో 28,127 మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా కింద రూ.215.63 కోట్ల లబ్ధి చేకూరినట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అందుకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.



పతనం తప్పదని జగన్‌కు తెలిసిపోయింది

ప్రజల సానుభూతి కోసమే బేలమాటలు
పీఏసీ చైర్మన్ పయ్యావుల



మీడియాతో మాట్లాడుతున్న కేశవ్

అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో పతనం తప్పదని జగన్‌కు తెలిసిపోయిందని, అందుకే ప్రజల సానుభూతి కోసం బేలమాటలు మాట్లాడుతున్నాడని పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ అధినాయకుడు చంద్రబాబును తిడుతూ, ప్రజల పక్షాన నిలిచిన పత్రికల యాజమాన్యాలను దూషిస్తూ.. తనకు మీడియా లేదన్నట్లుగా, తనకుతాను ఒక బాధితుడనని అన్నట్లుగా జగన్ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో బేలగా, బలహీనంగా, చేతగాని వాడిలాగా జగన్ ఉరవకొండ సభలో మాట్లాడటం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ప్రతిపక్షాలను కేసులతో ఇబ్బందులకు గురిచేసిన ఆయన, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాజ్యాధికారం కోసమే జగన్ పనిచేశారని, ఆ అధికారం పోతుందన్న భయంతోనే అలా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజల కోసం పనిచే సి ఉంటే ఆ భయం ఉండేది కాదని అన్నారు. వైసీపీ పాలనలో బాధింపబడిన అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అని కేశవ్ అన్నారు. నిత్యావసర ధరలు పెరగడంతో కుదేలైన సామాన్యులు, రైతులు, నిరుద్యోగులు, యువత, దళితులు, బీసీలు, ముస్లింలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఖాకీ యూనిఫాం వేసుకొని మీ కోసం పనిచేసిన పోలీసు టోపీ కూడా తమ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అవుతారని అన్నారు. వైసీపీకి దోపిడీదారులే బ్రాండ్ అంబాసిడర్లని ఎద్దేవా చేశారు.

ఇంకా ఏమేం అన్నారంటే..!.

నీరిచ్చారా..?

"జలదీక్షతో హంద్రీనీవా ద్వారా 8 వేల ఎకరాలకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో కనీసం 8 ఎకరాలకైనా నీరిచ్చారా..? మీ ప్రభుత్వానికి మరో నెల రోజులే సమయం ఉంది. ఇప్పుడు వడివడిగా ఏం పనులు చేస్తారు..? టీడీపీ హయాంలో హంద్రీనీవా పనులు 50 శాతం పూర్తి చేశాం. మీ పాలనలో తట్టెడు మట్టిని కూడా తీయలేదు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఒక్క పరిశ్రమను తీసుకొచ్చారా? మూడున్నరేళ్ల డ్రిప్ పరికరాల సరఫరాను ఆపేసి, ఆ తర్వాత అరకొరగా ఇచ్చారు. ఉరవకొండ నియోజకవర్గంలో నేను చేసిన పనులు కళ్ల ముందు కనబడతాయి. సీఎం జగన్‌ను ఉరవకొండకు తీసుకువెళ్లిన డబుల్ రోడ్డును టీడీపీ హయాంలో నేనే వేయించాను. ఉరవకొండలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలాంటిది మరెక్కడా లేదు."

వసూళ్ల పక్షి విశ్వ

"విశ్వ వసూళ్ల పక్షి. అన్నింటిలోనూ వసూళ్లకు పాల్పడుతున్నారు. బీఫాం వస్తుందో రాదోనని తాపత్రయంతో ఆయన మాట్లాడుతున్నారు. ఇళ్ల స్థలాల కోసం వంద ఎకరాల భూసేకరణ నా పోరాట ఫలితమే. నేను దొంగ పట్టాలు ఇచ్చానని అబద్ధాలు చెప్పి పేద ప్రజలను మభ్యపెట్టాలని చూడటానికి సిగ్గుగా లేదా విశ్వా ? నిష్పక్షపాతంగా నేనిచ్చిన జాబితాను మార్చలేక జగన్ బొమ్మ వేయడం కోసం పట్టాలు మార్చారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు దొంగ పట్టాలేనా..? చేతగాని దద్దమ్మ, అసమర్థుడు, ఉరవకొండ ప్రజానీకానికి నష్టం కలిగించిన వ్యక్తివి నువ్వు. రైతాంగానికి రూ.300 కోట్లు నష్టం కలిగించిన నీవు ఒక వైపు.. రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేసిన నేను ఒకవైపు ఉన్నాం. నాలుగున్నరేళ్లపాటు నిద్రపోయి.. ఎన్నికల ముందు జీడిపల్లి రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలని, కాలువ పనులు చేయాలని మాట్లాడటం ఏమిటి..? ఇన్నాళ్లు నీ హంద్రీనీవా సాధన సమితి ఎక్కడికిపోయింది..? నీ కబ్జాల చరిత్ర గురించి ఉరవకొండలో కథలుకథలుగా చెప్పుకుంటున్నారు. టీడీపీ హయాంలో 500 మంది వైసీపీ కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వచ్చింది. ఉరవకొండ ప్రజలే నాకు దేవుళ్లు. వారి కోసం ఎప్పటికీ పనిచేస్తూనే ఉంటా. మోసపూరిత మాటలతో ఎక్కువ కాలం ప్రజలను నమ్మించలేవని గుర్తుంచుకో విశ్వా.! నీ పతనం ఎప్పుడో నిర్ధారణ అయింది. నీ అసమర్థతను చూసి ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..'



గుట గుటా..



పదండి పోదాం..



ఊపిరాడలేదు అన్నో..

ఐదేళ్లనాటి హామీలే.. తాజాగా..!

- హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలకు నిధులట
- జీడిపల్లి పునర్నిర్మాణానికి రూ.88 కోట్లట
- ట్యాంకులు.. స్కూళ్లు.. ఇంకా చాలానే..!
- విశ్వ అడిగారు.. సీఎం సరేనన్నారు..!
- ఎన్నికల ముందు అయ్యే పనేనా ..?

అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికెగిరిందంట. అట్లుంది సీఎం జగన్ హామీల అమలు తీరు. ఉరవకొండ బహిరంగ సభలో ఆయన మాటలు కోటలు దాటాయి. అధికారం చేపట్టింది మొదలు.. 56 నెలల పాలనలో అమలు చేయని హామీలను ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అమలు చేస్తానని అంటున్నారు. అందులో కొన్ని హామీలు ఐదేళ్ల క్రితం ఇచ్చినవే. ప్రతిపక్ష నేతహోదాలో ప్రతినబూని.. సీఎం హోదాలో పాలన దాదాపు పూర్తి చేసి.. మళ్లీ ఇప్పుడు అవే హామీలు ఇచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వరరెడ్డి సీఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. అందుకు సీఎం సమ్మతించారు.



ప్రసంగిస్తున్న సీఎం జగన్

- ముంపునకు గురైన బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామ పునర్నిర్మాణానికి చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాన్ని రూ.88 కోట్లతో ఆదుకుంటామని హామీ ఇచ్చారు.
- హంద్రీనీవా కింద 75 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మిగిలిన డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి రూ.68 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెన్నహోబిళంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.33 కోట్లు, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో 12 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు రూ.210 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు.
- హామీలివ్వడం సీఎం జగన్‌కు కొత్తేమీ కాదు. ఈ జిల్లా మనవడినంటూ అనేక హామీలు ఇచ్చారు. ప్రతిపక్ష నేతగా హోదాలో ఉరవకొండలో జలదీక్ష చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కానీ మరిచారు. మళ్లీ ఇప్పుడు అదే హామీ ఇచ్చారు.
- ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ అనేక సార్లు జిల్లాకు వచ్చారు. ప్రతిసారీ ఏదో ఒక పథకానికి బటన్ నొక్కారు. కానీ హామీల గురించి ప్రస్తావించడం లేదు. ప్రతి సభలోనూ విపక్షాలపై విమర్శలు గుప్పించి వెళుతున్నారు. కానీ తను ప్రతిపక్షంలో ఉండగా మాటిచ్చిన హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి, హంద్రీనీవా విస్తరణ.. ఇలా వేటి గురించీ పట్టించుకోవడం లేదు. మాట తప్పను.. మడమ తిప్పనని చెప్పుకునే జగన్.. హామీలను గాలికొదిలేయడం మాట తప్పడం కాదా..? తాజాగా విశ్వేశ్వరరెడ్డి కోరిన వరాల పరిస్థితీ అంతేనని జనం నిట్టూరుస్తున్నారు.

31,306 సంఘాలకు లబ్ధి

నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్మును సీఎం జగన్ బటన్ నొక్కి మహిళల ఖాతాల్లోకి జమ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల ఖాతాల్లోకి రూ.6394.83 కోట్లు జమ చేస్తున్నామని ప్రకటించారు. ఇందులో జిల్లాకు చెందిన 31,306 సంఘాలలోని 3,08,150 మంది మహిళలకు రూ.236.94 కోట్ల లబ్ధి చేకూరనుంది.



బటన్ నొక్కి ఆసరా డబ్బు జమ చేస్తున్న జగన్

హెలిప్యాడ్ వద్ద కొందరికే...

ఉరవకొండ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కొందరు వైసీపీ నేతలకు సీఎం జగన్ దర్శనం కాలేదు. కేవలం 25 మందికే ఆ అవకాశం దక్కింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్, రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులను మాత్రమే సీఎంను కలిసేందుకు అనుమతిచ్చారు. ఈ క్రమంలో కొందరు ఎలాగోలా సీఎంను కలవాలని ప్రయత్నం చేశారు. ఇలా మొత్తం 25 మంది మాత్రమే సీఎంను కలిశారు. మిగిలిన వారికి అవకాశం దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. వీరిలో ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు ఉండటం గమనార్హం.



సీఎం జగన్ సభలో ఖాళీ కుర్చీలు...



దివ్యాంగులకు అనుమతి లేదు..

మంచినీరూ లేదు..!

గుంతకల్లు: ఆసరా బటన్ నొక్కుడు కార్యక్రమానికి రప్పించిన మహిళలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరవకొండ సభకు దాదాపు 30 వేల జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులు, విద్యాసంస్థల బస్సులను వాడుకున్నారు. ఉరవకొండ పట్టణం వెలుపలే బస్సులను నిలిపేశారు. దీంతో జనం దాదాపు 3 కి.మీ. దూరం నడిచి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆపసోపాలు పడుతూ వచ్చిన మహిళలకు సభలో కూర్చోవడానికి స్థలం లేక ఎండలో నిలబడ్డారు. బయట ఉన్నవారికి కనీసం తాగునీటి ప్యాకెట్లు కూడా ఇవ్వలేదు. ఎండ వేడిమికి నాలుకలు పిడచగట్టుకుపోయిన జనం.. నీటి కోసం దిక్కులు చూశారు. నీరు ఇచ్చేవారు లేకపోవడంతో ఐస్‌క్రీమ్ కొని తింటూ ఉపశమనం పొందారు. జగన్ ఉదయం 11-40 గంటల ప్రాంతంలో సభాస్థలానికి వచ్చారు. ఆయన వేదికపైకి ఎక్కగానే బయట ఉన్నవారు తిరుగు ప్రయాణంకట్టారు. ఆసరా డబ్బు కోసం మీటింగ్ వద్ద థంబ్ వేయాల్సి ఉంటుందని చెప్పి పొదుపు సంఘాల సభ్యులను బలవంతంగా సమావేశానికి తెచ్చారు. అడుగడుగునా నిలిచిన సీసీలు, మెప్మా సిబ్బంది పొదుపు సంఘాల మహిళలను సభ వద్దకు తరలించారు. జగన్ మాట్లాడక మునుపే బయట ఉన్న మహిళలు వెళ్లిపోగా, సభలోని వారు అరగంట గడవకనే లేచి వెళ్లిపోయారు. టీడీపీకి చెందిన పొదుపు మహిళలు సైతం సీఎం సమావేశానికి వచ్చారంటే.. వారిపై ఒత్తిళ్లు ఏమేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.



జగన్ ప్రసంగా ప్రారంభం కాకనే వెళ్లిపోతున్న పొదుపు మహిళలు

ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు చుక్కెదురు

వెంట వచ్చిన వారిని ఎయిర్‌పోర్టులోకి అనుమతించని అధికారులు.. ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడినా ఫలితం శూన్యం

పుట్టపర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి విమానాశ్రమంలో సీఎం జగన్‌కు వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌కు చుక్కెదురైంది. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రమంలోకి వెళ్లేందుకు ఎమ్మెల్సీ ఇక్బాల్ వెంట హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైసీపీ నేతలు వచ్చారు. ఎమ్మెల్సీతోపాటు వారు కూడా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. లిస్టులో పేరు లేని వైసీపీ నేతలతోపాటు ఎమ్మెల్సీని పోలీసులు అడ్డుకున్నారు. తాను ఎమ్మెల్సీననీ, మాజీ డీఐజీ కూడా అని చెప్పుకున్నా.. వినలేదు. ఎవరైతే ఏంటనీ, లిస్టులో పేరులేని వారిని అనుమతించేది లేదని తెగేసి చెప్పారు. చివరకు ఆర్డీఓ భాగ్యరేఖకు ఎమ్మెల్సీ ఇక్బాల్ ఫోన్ చేసి, వెంట వచ్చిన వారిని అనుమతించాలని విన్నవించారు. 'అమ్మా.. తల్లీ.. దుర్గామాత, కనికరించు తల్లీ.. మావాళ్లను పంపించు' అంటూ విన్నవించడం ఆశ్చర్యానికి లోనుచేసింది. లిస్టులో పేరు ఉన్న వారినే అనుమతిస్తామనీ, లేకుంటే అవకాశం లేదని ఆర్డీఓ నిరాకరించారు. అనుమతించకపోవడంతో ఎమ్మెల్సీ ఇక్బాల్ ఒంటరిగా సీఎంకి వీడ్కోలు పలికేందుకు వెళ్లగా.. వెంట వచ్చినవారు నిరాశతో వెనుదిరిగారు.



మీరొక్కరే వెళ్లండి సార్..

అనంత లఘుచిత్ర వారోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్, జనవరి 23 : అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ, హెచ్‌డీ విజన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో 6వ అనంత లఘుచిత్ర వారోత్సవాలను ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, కంటివైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్ ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రషీద్‌బాషా మాట్లాడుతూ... లఘుచిత్ర వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26, 27 తేదీల్లో విద్యుత్‌నగర్-2 ప్రివ్యూ థియేటర్‌లో చిత్రాలను ప్రదర్శించి, విజేతలను ఎంపిక చేస్తామన్నారు. కంబదూరు షేక్ నబిరసూల్, తోట బాలన్న, కన్నూరప్ప, మురళీధరరావు, సుధాకర్, హసీనా, సూర్యనారాయణ, అనిల్‌కుమార్, కేవీ రమణ, విజయసాయికుమార్ యాంకర్ రమేష్ నీల్, జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి లఘుచిత్ర వారోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

నేడు పరిటాల రవి వర్ధంతి

- వెంకటాపురానికి తరలిరానున్న అభిమానులు
- ఏర్పాట్లను పరిశీలించిన పరిటాల సునీత, శ్రీరామ్

రామగిరి, జనవరి 23: పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత నేత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర19వ వర్ధంతిని మండలంలోని వెంకటాపురంలో బుధవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలిరానున్నారు. మంగళవారం మాజీ మంత్రి పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ కుటుంబసభ్యులతో కలిసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఏటా పరిటాల రవీంద్ర వర్ధంతి నాడు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పరిటాల రవి ఘాట్‌ను ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అలంకరించనున్నారు. వేలాదిమందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పరిటాల రవి కన్నుమూసి 19 ఏళ్లు అయినప్పటికి ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉందన్నారు. అందుకే ప్రతి ఏడాది అభిమానులు వేలాదిగా తరలివచ్చి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్నారన్నారు. ప్రజలు తమపై చూపిస్తున్న ప్రేమ వల్లతమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అభిమానుల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఈ ఏడాది రవీంద్ర వర్ధంతిని అన్నిమండల కేంద్రాల్లో నిర్వహించుకున్న తరువాత వెంకటాపురంకు రావాలని విజ్ఞప్తి చేశారు. వర్ధంతికి ఎన్ని వేలమంది తరలివచ్చినా ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



వంట ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిటాలసునీత, శ్రీరామ్

వైసీపీ పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



రామగిరి, జనవరి 23: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన వెంకటాపురంలోని తన స్వగృహంలో విలేకరులతో మా ట్లాడుతూ మరోసారి వైసీపీ వస్తే రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరని, వీరి పాలనలో ఏ ఒక్కరూ బాగుపడలేదు కదా రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. అధిక ధరలతో ప్రజలను తీవ్ర నష్టాలకు గురిచేశారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి చెత్తపై పన్నులు వేసిన చెత్త ఏకైక ముఖ్యమంత్రి జగనే అని ఆయన విమర్శించారు. టీడీపీ పాలనలో ఏ రోజూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పండుగలకు కానుకలు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో అలాంటివి ఏమీలేవని మండిపడ్డారు. మద్యపాన నిషేధమంటూ ప్రగల్బాలు పలికి నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్ ఇప్పుడు ఎమ్మెల్యేలను మారుస్తున్నారన్నారు. అది కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై మాత్రమే వేటు వేస్తున్నారని, ప్రజలు సీఎంను మార్చాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చూపిస్తామన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

రాయదుర్గం, జనవరి 23: అయోధ్యలో బాలరాముడి దర్శనార్థం వెళ్లే భక్తుల దర్శనార్థం రాయదుర్గం మీదుగా నైరుతి రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ మంగళవారం ప్రకటించారు. బెంగుళూరు నుంచి 06201 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 31, ఫిబ్రవరి 14, 28 తేదీల్లో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బయలుదేరి మ ధ్యాహ్నం 12.30కు రాయదుర్గం చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అయోధ్యకు చేరుకుంటుంది. శనివారం రాత్రి 7.20కు అయోధ్యలో బయలుదేరి సోమవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం చేరుకుని మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బెంగుళూరుకు చేరుకుంటుంది. మైసూరు నుంచి అయోధ్యకు 06202 నంబరు గల రైలు ఫిబ్రవరి 4, 18వ తేదీల్లో ఆదివారం రాత్రి 12.32 మైసూరులో బయలుదేరి రాయదుర్గంకు మధ్యాహ్నం 12.30కు చేరుకుని మంగళ వారం మధ్యాహ్నం ఒంటిగంటకు అయోధ్యకు చేరుకుంటుంది. బుధవారం రాత్రి 7.20 కు బయలుదేరి శుక్రవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం మీదుగా శనివారం ఉదయం 7 గంటలకు మైసూరుకు చేరుకుంటుంది. టుంకూరు నుంచి అయోధ్య 06203 నంబరు రైలు ఫిబ్రవరి 7, 21 తేదీలలో గురువారం టుంకూరులో తెల్లవారుజామున 5.20 బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రాయదుర్గం కు చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అయోధ్యకు చేరుకుంటుంది. శనివారం రాత్రి 7.20 గంటలకు అయోధ్యలో బయలుదేరి సోమవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గం చేరుకుని శని వారం అర్ధరాత్రి 1.20 గంటలకు టుంకూరుకు చేరుకుంటుంది. చిత్రదుర్గం నుంచి అయోధ్యకు 06204 నంబరు గల రైలు చిత్రదుర్గంలో ఫిబ్రవరి 11, 25 వ తేదీలలో ఆదివారం రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు రాయదుర్గం చేరుకుని మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అయోధ్యకు చేరుకుంటుంది. అయోధ్యలో బుధవారం రాత్రి 7.20కు బయలుదేరి శుక్రవారం రాత్రి 8 గంటలకు రాయదుర్గంకు చేరుకుని 10.20 గంటలకు చిత్రదుర్గంకు చేరుకుంటుంది. మైసూరు నుంచి అయోధ్య కు 06206 నంబరు గల రైలు మైసూరు నుంచి ఫిబ్రవరి 17 న శనివారం తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు రాయదుర్గంకు చేరుకుని సోమవారం ఒంటిగంటకు అయోధ్యకు చే రుకుంటుంది. మంగళవారం అయోధ్యలో రాత్రి 7.20కు బయలుదేరి గురువారం సాయంత్రం 6 గంటలకు రాయదుర్గంకు చేరుకుని శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటలకు మైసూరుకు చేరుకుంటుంది. ప్రత్యేక రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అర్జీలిస్తామంటే... అరెస్టు చేస్తారా..?

- సీఎం పర్యటనకు వెళ్తున్న సీపీఐ, యూటీఎఫ్ నాయకులను అడ్డుకోవడంపై నేతల మండిపాటు



సీపీఐ జాఫర్ మెడపై గాయాలు



వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో జాఫర్, ఇతర నేతలు

అనంతపురం విద్య, జనవరి 23 : రైతుల, కూలీలు, కార్మికుల సమస్యలపై అర్జీలిచ్చేందుకు వెళ్తుంటే అరెస్టులు చేసి అడ్డుకుంటారా అని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఉరవకొండలో సీఎం పర్యటన నేపథ్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏపీ రైతు సంఘం నేతలు ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మల్లికార్జున, కేశవరెడ్డి మనోహర్, కుళ్లాయిస్వామి, సంతోష్, ఆ నంద్, మోహన్ ఉరవకొండకు వెళ్తుండగా పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకుని వజ్రకరూరు, ఇతర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పోలీసుల తోపులాటలో జాఫర్‌కు గాయాలయ్యాయి. మరికొందరిని నగర శివారు ప్రాంతాల్లోనే నిలువరించారు. అరెస్ట్‌లపై జాఫర్, నారాయణస్వామి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, విద్యార్థుల సంక్షేమం పట్టకుండా వ్యవహరిస్తోందంటూ...మండిపడ్డారు. జిల్లాలో తీవ్ర కరువు నేపథ్యంలో ప్రజలు అన్నమోరామచంద్ర అంటున్నారన్నారు. గత నెల 12న కరువు బృం దాలు పర్యటించినా.... ఇప్పటి వరకూ రైతులను ఆదుకోవడానికి సర్కారు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారని, అయితే జీబీసీకి నీళ్లు రాక..అన్నదాతలు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్ర భుత్వం స్పందించి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు. లేకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

యూటీఎఫ్ నేతలూ స్టేషన్‌కే...

యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లు నాగరాజును సీఎం పర్యటన నేపథ్యంలో తెల్లవారుజామునే ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. దీనిపై ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు మండిపడ్డారు. సీఎం ఎక్కడికి వెళ్లినా యూటీఎఫ్ నేతలను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఉపాధ్యాయులపై అణచివేత ధోరణి సరికాదన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో యూటీఎఫ్ నేతలు

తిరుపతికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, జనవరి23: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (వయా గుంతకల్లు) మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి (నెం. 07041) రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 25వ తేదీన గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07042) ఈనెల 26వ తేదీ శుక్రవారం సాయంత్రం 7-50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరినవారితో పల్లె

నల్లమాడ, జనవరి 23: నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలంలోని గసికవారిపల్లికి చెందిన టీడీపీ నాయకులు రమేష్, వాల్మీకి గంగాధర్ ఆధ్వర్యంలో 7 వైసీపీ కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగళవారం నల్లమాడ మండలంలోని జయహో బీసీ సదస్సుల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రతి ఒకరు టీడీపీ గెలుపునకు సైనికుల్లా కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒకరికీ సముచిత స్థానముంటుందన్నారు. రమణ, హరి, సోము, శేఖర్, ముని, తిరుపాల్‌తోపాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు బుచ్చయ్యచౌదరి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలబావిని పరిరక్షించుకోవాలి: జనసేన

కదిరి అర్బన్, జనవరి 23: కదిరి నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలో ముత్యాలచెరువు వద్ద ఉన్న ఖాద్రీలక్ష్మీనరసింస్వామి అతి పురాతనమైన పాలబావిని పరిరక్షించుకోవాలని జనసేన నాయకులు అన్నారు. మంగళవారం జనసేన నాయకులు పాలబావిని సందర్శించారు. వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా పాలబావి కనుమరుగైయ్యే పరిస్థితులు నెలకున్నాయన్నారు. దీనిపై ఆలయ అధికారులు, పాలకవర్గం, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన భైరవప్రసాద్, మంచి శివశంకర్, గవ్వల శ్రీనివాసులు, చిన్నప్పరెడ్డి, రామచంద్ర, రవికుమార్; మహేష్, శివారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఆర్టీసీ బస్సులు

విద్యార్థులకు ఇబ్బందులు

పుట్టపర్తి, జనవరి 23: ప్రతిరోజు ఆర్టీసీ బస్సుల్లో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ పర్యటనకు మంగళవారం వచ్చారు. ఈ నేపథ్యంలో నాయకులను, కార్యకర్తలను, సమావేశానికి తరలించడానికి ఆర్టీసీ బస్సులను వినియోగించారు. దీంతో పాఠశాలలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.

భూమిని ఆక్రమిస్తున్నారంటూ ఫిర్యాదు

ధర్మవరం, జనవరి 23: తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లి గ్రామంలో 25 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నట్టు ఆ గ్రామానికి చెందిన సోమశేఖర్‌నాయుడు ఆర్డీఓ రమేష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ కార్యాలయానికి మంగళవారం చేరుకుని కొందరు గ్రామానికి చెందిన నాయకులు 25 ఎకరాల భూమిలో ప్లాట్లు వేసి పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో మర్రిమాకులపల్లి గ్రామస్థులు నారాయణ స్వామి, రమేశ్‌బాబు, హేమంత్, రాజశేఖర్ ఉన్నారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీలకు కదిరి విద్యార్థులు

కదిరిఅర్బన్, జనవరి 23: జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు మాక్స్ అబాకస్ నిర్వాహకురాలు రాయగీతవాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 28న చెన్నైలో జరిగే పోటీల్లో మనోజ్‌సాయి, యాసిన్, అభిరామ్, భవశ్యరెడ్డి, సాయిసాత్విక్, ఫిరదోస్, నేత్రం, విదుషా, ఆర్థిక్‌రెడ్డి, జతీన్‌రెడ్డితోపాటు 23 మంది పాల్గొంటారన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

పుట్టపర్తి, జనవరి 23: గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సంస్కృతిక కార్యక్రమాలు, ఫోటోకాల్, విద్యుత్‌సరఫరా, శకటాలు, స్టాల్స్ తదితరాంశాలపై సమక్షించారు. ఈసమీక్షలో డిఆర్‌ఓ కొండయ్య తదితరులున్నారు.

యాదవ సాధికార సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాసులు యాదవ్



శ్రీనివాసులు యాదవ్

ధర్మవరంరూరల్, జనవరి23: నియోజకవర్గ టీడీపీ యాదవసాధికారసమితి కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన శ్రీనివాసులుయాదవ్‌ను పరిటాలశ్రీరామ్ నియమించారు. అధ్యక్షులతోపాటు ఇతర కమిటీ సభ్యులను మంగళవారం నియమించారు. ఉపాధ్యక్షులుగా బాల ఓబిలేసుయాదవ్, నాగేంద్రయాదవ్, బాలహరి యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నవీన్‌కుమార్ యాదవ్, రాజన్నయాదవ్, గంగమోహన్‌యాదవ్, అధికారప్రతినిధులుగా నరేంద్రయాదవ్, బాలబయన్నయాదవ్, శేఖర్‌యాదవ్, రామకృష్ణయాదవ్‌ను నియమించారు. మీడియాకోఆర్డినేటర్ గోపీనాథ్‌యాదవ్, కార్యదర్శులుగా శ్రీనాథ్‌యాదవ్, జనార్ధన్‌యాదవ్, కిషోర్‌యాదవ్, ఆకుకూరరాముయాదవ్, లక్ష్మణస్వామి యాదవ్, పెద్దన్నయాదవ్‌ను నియమించారు. నూతన కమిటీ పరిటాలశ్రీరామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టు రైతులు, రీలర్లకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ధర్మవరం, జనవరి 23: రాష్ట్ర ప్రభుత్వం పట్టురైతులు, రీలర్ల పట్ల నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనుచరులు మండిపడ్డారు. ఐదేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం 7వ రోజు స్థానిక సిరికల్చర్ కార్యాలయం వద్ద పట్టు రైతులు, రీలర్లు సమ్మె చేపట్టారు. సమ్మెకు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, దుస్సాక్రిష్ణ, తుంపర్తి పరమేశ్, బోడగలగిరిధర్, నబీరసూల్, రాప్తాటిరాములు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టురైతులను వైసీపీ దగా చేస్తోందన్నారు. పట్టురైతుల సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రీలర్స్‌సంఘం నాయకులు శ్రీనివాస రెడ్డి, అచ్యుత, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

పురస్కార ప్రదానం



అవార్డు అందకుంటున్న విలేకరి నరసింహులు

కదిరి, జనవరి 23: ఏబీఎన్ కదిరి విలేకరి నరసింహులు గిడుగు రామ్మూర్తి పంతులు జీవన సాఫల్య జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జి.చంద్రయ్య.. ఆయనకు అవార్డును ప్రదానం చేసి, సత్కరించారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు పదవులు

జయహో బీసీ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె



నల్లమాడలో ర్యాలీ చేపడుతున్న పల్లె, బీసీ నాయకులు

నల్లమాడ, జనవరి 23: టీడీపీ పాలనలోనే బీసీలకు పదవులు వచ్చాయని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. రాబోవు ఎన్నికల్లో బీసీ వర్గాలే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. మంగళవారం మండలంలో టీడీపీ జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్లె హాజరయ్యారు. మొదట ఎర్రవంకపల్లి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై కొత్తపల్లితండా, రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి, చెంద్రాయునిపల్లి, నల్లగుండ యనుములవారిపల్లి, గట్లు క్రాస్ మీదుగా పులగంపల్లి, దొన్నికోట, చెర్లోపల్లి, మూలప్పగారిపల్లి, మసకవంకపల్లి, గంగాపురం, చౌటకుంటపల్లి, ఎద్దులవాండ్లపల్లి, తండా, నల్లమాడ మెయిన్‌రోడ్డు మీదుగా, బండవాండ్లపల్లి, బాసమవారిపల్లి, నల్లమాడ మైలేశివశంకర్ నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లె మాట్లాడుతూ వైసీపీలో అనేక మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించి వేధించిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దానిని తుంగలో తొక్కి, ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టడానికి బూటకపు పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీఎం బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా బీసీలు ఏకతాటిపై వచ్చి టీడీపీకి మద్దతుగా నిలిచి గెలుపుకోసం రాజీలేని పోరాటం చేయాలన్నారు. జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్లా మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పవన్‌కళ్యాణ్‌కు బీసీలపై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పులివెందల మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వలిపి సోముశేఖర్, యువనాయకులు శ్యామ్‌బాబు, సలాంఖాన్, మణికుమారి, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, మంజునాథ్‌రెడ్డి, మైలే రామచంద్ర, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణనాయుడు, గుండ్ర శివారెడ్డి, గడ్డం రమణారెడ్డి, గన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి గోరేసాబ్, నాగభూషణరెడ్డి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, గంగులప్పనాయుడు, ప్రసాద్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, పాపారాయుడు, అబ్బాస్‌ఖాన్, అగ్గిరాముడు, రాము, టైలర్ రాము తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవంకపల్లిలో కేక్ కట్ చేస్తున్న పల్లె



కదిరిలో..



ధర్మవరంలో కేక్‌కట్ చేస్తున్న తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో...



పుట్టపర్తిలోని హనుమాన్ కూడలి వద్ద...



ప్రశాంతి గ్రామంలో...



కొత్తచెరువులో...



ముదిగుబ్బలో...



బత్తలపల్లిలో...

ఘనంగా నారా లోకేశ్ పుట్టినరోజు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎర్రవంకపల్లిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కదిరిలో నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ధర్మవరంలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వేడుకలు జరిపారు. పుట్టపర్తిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాలంచెల్లిన బస్సులతో ప్రమాదాలు

అద్దెబస్సులే అధికం

సిబ్బంది భర్తీకి చొరవచూపని వైనం



ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు

ధర్మవరం, జనవరి 23: ఆర్టీసీలో కాలంచెల్లిన బస్సులను నడపటం డ్రైవర్లకు కత్తిమీద సాముగా మారుతోంది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత ఉద్యోగులకు, ప్రయాణీకులకు పెరిగిన సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సర్వీసులు రద్దు

శ్రీసత్యసాయి జిల్లాలో ప్రస్తుతం 50 డ్రైవర్ల పోస్టులు ఖాళీగా ఉండగా ఈ ఏడాది మరో 50 మంది పదవీవిరమణ పొందుతుండటంతో ఆ సంఖ్య వందకు చేరుకోనుంది. ఈ మేరకు ఆర్టీసీ వర్గాలే పేర్కొంటున్నాయి. కండక్టర్లకు సంబంధించి 250 పోస్టులు ఖాళీ ఉన్నాయి. నాలుగేళ్లగా అద్దె బస్సులు పెంచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా దాదాపు 150 అద్దెబస్సులు ఉండగా 350 దాకా ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. గతంలో 450 బస్సులు ఉండేవి. వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో చాలా ప్రాంతాలకు రాత్రి సర్వీసులను రద్దుచేశారు.

తాత్కాలిక సిబ్బంది

అద్దె బస్సులతో ఆర్టీసీకి సొంతంగా డ్రైవర్ల అవసరం లేకుండాపోయింది. టీమ్ సర్వీసులు, నాన్‌స్టాప్‌లను పెంచడం ద్వారా శాశ్వత ప్రాతిపదికన కండక్టర్ల నియామకం నిలిపివేశారు. కేవలం నెలకు రూ.9వేలతో తాత్కాలిక ప్రాతిపదికన కండక్టర్లను నియమిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో సైతం శాశ్వత డ్రైవర్లు లేరు. ఆన్‌కాల్ డ్రైవర్లుగా అప్పటికప్పుడు ప్రైవేట డ్రైవర్లను తీసుకుంటున్నారు. ఎలాంటి శిక్షణ లేకుండా వీరికి ఆర్టీసీ బస్సులను అప్పగించడం, వీరికి ప్రయాణీకులతో ఎలా వ్యవహరించాలో తెలియకపోవడంతో పలుమార్లు ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. డిపోల్లోని గ్యారేజీల్లో, టైర్ రీట్రేడింగ్ యూనిట్లలో సిబ్బందిని ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకుంటున్నారు. దీంతో కొన్ని బస్సులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి.

కొత్త బస్సులకు మంగళం

ఆరేళ్లగా ఆర్టీసీలో కొత్త బస్సులను కొనుగోలు చేయలేదు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానాల్లో కొత్తవారిని నియమించలేదు. అత్యవసరంగా అప్పటికప్పుడు తాత్కాలిక ప్రాతిపదికన కండక్టర్లు, డ్రైవర్లను నియమిస్తున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దుచేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మీటరు రోడ్డయినా బాగు చేయించావా..?

ఏ మొహం పెట్టుకుని పాదయాత్ర చేస్తావ్..?

ఎమ్మెల్యే దుద్దుకుంటపై టీడీపీ నాయకుల మండిపాటు



ఇరగంపల్లి రోడ్డును చూపుతున్న టీడీపీ నాయకులు

కొత్తచెరువు, జనవరి 23: పదవీ కాలం పూర్తవుతున్నా నియోజకవర్గంలో మీటరు రోడ్డైనా బాగుచేయించావా..? అంటూ టీడీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని ఇరగంపల్లి నుంచి తలమర్లకు వెళ్లే రోడ్డును మరుకుంటపల్లి నుంచి పోతులకుంటకు వెళ్లే రోడ్డును టీడీపీ నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో పాదయాత్ర మొదలు పెట్టేటప్పుడు మండల అభివృద్ధికి నీవు ఏమాత్రం చేశావో ప్రజలకు చెప్పి పాదయాత్రను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, అడపాల రామకృష్ణ, ఒలిపిశీన, బండ్లపల్లిరాజు, శివ, షర్ఫుద్దీన్, సురేశ్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రామ్మోహన్, రవి, నల్లమాడశంకర్, హర్షచౌదరి, రాహుల్‌చౌదరి, పీఎస్ వెంగప్ప, శ్రీనివాసచౌదరి, సుహేల్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, జనవరి 23: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సత్యసాయి విమానాశ్రయంలో అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం ఉమ్మడిజిల్లా పర్యటనకు అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి, పెద్దారెడ్డి, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖతోపాటు పలువురు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి 10.30కు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉరవకొండకు బయలుదేరి వెళ్లారు. తిరిగి ఉమ్మడిజిల్లా పర్యటన ముగించుకుని సాయంత్రం 4.50 గంటలకు ప్రత్యేక విమానంలో అమరావతికి బయలుదేరి వెళ్లారు.

కదిరి ఓటర్లు 2,50,776 మంది

కదిరిఅర్బన్, జనవరి 23: సార్వత్రిక ఎన్నికల ముందు కీలకమైన ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. కదిరి నియోజకవర్గ ఓటర్లు 2,50,776 మందిగా నమోదయ్యారు. గత అక్టోబరులో విడుదలైన జాబితాతో పోల్చితే 1,721 మంది పెరిగారు. మొత్తం ఓటర్లలో పురుషులకంటే మహిళలే అధికంగా ఉన్నారు. కదిరి అర్బన్ 79,634, కదిరి రూరల్ 26,775, తలుపుల 33,632, గాండ్లపెంట 21,372, నంబులపూలకుంట 24,281, నల్లచెరువు 24,915, తనకల్లు 40,167మంది ఓట్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,27,027మందికాగా, పురుషులు 1,23,742, ఇతరులు 7మంది ఉన్నారు.

కొనసాగనున్న మార్పుచేర్పులు

రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించిన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు కొనసాగుతాయని అధికారులంటున్నారు. ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి, బూత్‌స్థాయి అధికారి వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలియచేసే వెసులుబాటు కల్పించారు.

ఓటరు తుది జాబితాపై సమావేశం

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ నరేంద్రకుమార్ తుదిఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాను ఓటర్లు సరిచూసుకోవడానికి అందుబాటులో ఉంచామన్నారు. ఫారం 6, 7, 8 దరఖాస్తు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేవరకు చేసుకోవచ్చని సూచించారు. అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'రోడ్లను బాగుచేయండి'

ధర్మవరం, జనవరి 23: గుంతలమయంగా మారిన పట్టణ రహదారులను బాగుచేయాలని, ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు విజ్ఞప్తిచేశారు. సంబంధిత ఇంజనీర్లు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం కార్యాలయంలో అధికారి శేషన్నకు వినతిపత్రం అందజేశారు. గుడ్‌మార్నింగ్‌లో రోడ్ల దుస్థితి ఎమ్మెల్యేకు కనిపించలేదా అని ప్రశ్నించారు. డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తిపరమేశ్, గొట్లూరుచంద్ర, దుస్సాక్రిష్ణ, బోడగలగిరిధర్, నబీరసూల్,నారాయణస్వామియాదవ్, రాప్తాటిరాము, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, గంధమనేని నారాయణస్వామి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

'ప్రమాదాలను నివారించండి'

ధర్మవరం, జనవరి 23: రోడ్డుభద్రతా నియమాలు పాటించి రోడ్డుప్రమాదాలు నివారించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం ప్రధానకూడలిలో జాతీయభద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు నిబంధనలపై ఆటోడ్రైవర్లకు, ట్యాక్సీ డ్రైవర్లకు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుభద్రతా నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు తప్పించాలని పిలుపినిచ్చారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు.

రామాలయ జీర్ణోద్ధరణకు విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

బుక్కపట్నం, జనవరి 23: మండల కేంద్రంలోని అతిపురాతనమైన రామాలయ జీర్ణోద్ధరణ కోసం మంగళవారం బెంగుళూరుకు చెందిన బిల్డర్స్ కిరణ్, లక్ష్మీకాంత్, ఉమేష్, నీలకంఠ రూ.రెండు లక్షలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్, టీడీపీ ఫోరానికి చెందిన కెంప రాజు రాజశేఖర్‌గౌడ్‌కు అందించారు.

ఘనంగా నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి

ముదిగుబ్బ, జనవరి 23: మండలకేంద్రంలోని బస్‌షెల్టర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి పం చిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణప్ప, రమణ గోగుల, చంద్రశేఖర్, మస్తాన్, పరమేష్, హరి, అమర్, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకర్ కొండమరాజు, నాయకులు జ్యోతిప్రసాద్, కత్తి రాజా, బాల గంగాధర్, రామాంజనేయులు, కళ్యాణ్, నారాయణ తదితరులు న్నారు.

మారెమ్మ ఆలయంలో చోరీ



బీరువాను పగులగొట్టిన దుండగులు

కొత్తచెరువు, జనవరి 23: మండలంలోని అప్పలవాండ్లపల్లి మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో ఇటీవల నిర్మించిన ఈ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఆలయ పూజారి రోజులాగే పూజలు నిర్వహించడానికి వచ్చారు. అప్పటికే తలుపులు తెరచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగిందని గ్రహించి గ్రామస్థులకు మైకు ద్వారా తెలిపారు. ఆలయ తలుపుల తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన వెండికిరీటం, పాదాలు, చేతులకు అమర్చిన వెండి ఆభరణాలు, వెండి గొడుగులు అపహరించారు. దాదాపు 5కేజీల వెండితోపాటు ఒకటిన్నర తులం బంగారం, బీరువాలో ఉంచిన రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్ బాబు ఆలయానికి వెళ్లి పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

'ప్రభుత్వ భూములను అభివృద్ధికి వినియోగించాలి'

గాండ్లపెంట, జనవరి 23: ప్రభుత్వ భూమిని అభివృద్ధికే వినియోగించాలని పలు సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. మంగళవారం మండలకేంద్రంలోని కదిరి, రాయచోటి రోడ్డులో ఉన్న సర్వేనెంబర్ 1294లో మైనార్టీలకు షాదీమహాల్, గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల నిర్మాణాలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారన్నారు. గతంలో షాదీమహాల్ నిర్మాణాన్ని ప్రారంభించారని, ఈ మేరకు శిలాఫలకం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఆ స్థలంలో ఇటీవల తమకు పట్టా అందించారని, జేసీబీతో చదును చేస్తుండగా వారిని అడ్డుకోవడం జరిగిందన్నారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ వెంకటనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో అభివృద్ధికి సంబంధించిన నిర్మాణాలు జరగాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున అందోళనలు చేపడతామని మైనార్టీ నాయకులు, ఎస్సీఎస్టీ, ఇతర సంఘాల నేతలు తెలిపారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌నకు

దరఖాస్తు చేసుకోండి

అగళి, జనవరి 23: నేషనల్ స్కాలర్‌షిప్ కోసం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ హాస్టల్ వార్డెన్ సికింద్‌బాష తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని మోడల్ పాఠశాలతో పాటు అగళి, ఇనగలూరు, ఇరిగేపల్లి, పీ బ్యాడిగిర, మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ప్రభుత్వం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించి అర్హత పొందిన వారికి సంవత్సరానికి రూ.75వేలు అందజేస్తుందని తెలిపారు. కావున ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 9వ తరగతి విద్యార్థులతో కలిసి చర్చించి ప్రతిఒక్కరూ నేషనల్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే శిశుమరణాల నివారణ

డాక్టర్ కేశవులు

హిందూపురం అర్బన్, జనవరి 23: పౌష్టికాహారంతోనే శిశు మరణాలను నివారించవచ్చని అఖిల భారత చిన్న పిల్లల వైద్యుల సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కేశవులు పేర్కొన్నారు. కేరళలో జరుగుతున్న ఐఏపీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ... చిన్నపిల్లల మరణాలు తగ్గాలంటే పౌష్టికాహారలోపాన్ని అధిగమించాలన్నారు. అందుకు కోసం ప్రత్యేకంగా శ్రమించాల్సిన అవసరం లేదన్నారు. బిడ్డకు అన్ని విధాలా శ్రేయస్కరం తల్లి పాలే అన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే అందులో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఆయన తెలిపారు. మొదటి ఆరునెలల వరకు తల్లిపాలు అందించాలనీ, తరువాత ఇంటిలో వండిన మెత్తటి పదార్థం అలవాటు చేయాలన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

పెనుకొండ టౌన్, జనవరి 23: పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్లు మంగళవారం ఎన్నికల డీటీ హనుమంతు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలకుగాను 2,33,687 ఓటర్లు ఉన్నారన్నారు. పెనుకొండ రూరల్ 22,862, పెనుకొండ అర్బన్ 21,782, గోరంట్ల 63080, సోమందేపల్లి 39,042, పరిగి 46,138, రొద్దం 40,783 ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు 1,16,373, పురుషులు 1,17,311మంది ఉన్నారన్నారు. 265పోలింగ్ బూత్‌లు, థర్డ్‌జండర్ ముగ్గురు ఉన్నట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

హిందూపురం అర్బన్, జనవరి 23: పట్టణ పరిధిలోని మేళాపురం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు టీడీపీ నాయులు మంగేష్, ప్రియా గంగాధర్ రూ.25 వేలు విరాళం అందజేశారు. మేళాపురంలో ఫిబ్రవరి నెలలో 33 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం తమ వంతు సాయంగా విరాళం అందించామని వారు తెలిపా రు. దైవ కార్యక్రమం కోసం తాము ఎప్పుడు ముందుంటామని తమకు చేతనైన సాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

గుడిబండ, జనవరి 23: మండలంలోని జమ్ములబండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌ను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం పరామర్శిం చారు. శ్రీనాథ్ అనారోగ్యంతో బాధపడుతూ తుమకూరు ఆసుపత్రిలో చికిత్సపొంది స్వగ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గుండుమల తిప్పేస్వామి జమ్ములబండ గ్రామానికి చేరుకుని శ్రీనాథ్‌ను పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గుండుమల వెంట టీడీపీ నాయకులు జయరామప్ప, తదితరులు ఉన్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన

లేపాక్షి, జనవరి 23: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని డీవైఈఓ రంగస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల, వివేకానంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు నిధులకు కొరత లేదని పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఎఫ్ఏ-3 పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు నాయక్, పాఠశాల సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

ధర్మస్థల ట్రస్ట్ నిర్ణయం

అభినందనీయం: టీడీపీ

గుడిబండ, జనవరి 23: మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ నిర్వాహకులు వీరేంద్ర హెగ్డే ప్రకటించడం అభినందనీయమని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ పేర్కొన్నారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం గుడిబండలో వీరేంద్ర హెగ్డే చిత్రపటానికి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ధర్మస్థల మంజునాథ గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి మడకశిర నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడా నికి దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గేష్, రాజేంద్ర, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోరంట్ల, జనవరి 23: మండలంలోని మల్లాపల్లి వద్ద కారును బొలేరో వాహనం ఢీకొనడంతో తల్లీకొడుకు లక్ష్మీనారాయణమ్మ, రాహుల్‌రెడ్డి తీవ్రంగా గాయపడినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని పాలసముద్రం సమీపంలో ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న తన మరో కుమారుడిని కలవడానికి కడపజిల్లా ఎర్రగుంట్ల మండలంలోని కోడూరుకు చెందిన లక్ష్మీనారాయణమ్మ పెద్ద కుమారుడు రాహుల్‌రెడ్డితో కలిసి మంగళవారం కారులో వెళ్తోంది. అయితే మల్లాపల్లి మలుపువద్ద వారు ప్రయాణి స్తున్న కారు, ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణమ్మకు ఎడమకాలు విరగగా, రాహుల్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. వారిని స్థానికులు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రినుంచి అందిన రిపోర్టు ప్రకారం మంగళవారం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



పురంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



టీడీపీ పెనుకొండ కార్యాలయంలో కేక్‌కట్‌చేస్తున్న సవిత

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో అధికార పార్టీ వైసీపీ చేస్తున్న అరాచకాలు, ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న యువనేత నారాలోకేశ్ అని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం హిందూపురంలోని ఎమ్మెల్యే నందమూరి బాలకృ ష్ణ నివాసం వద్ద భారీ కేక్ కట్‌చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్‌చేసి ఒకరినొకరు తినిపించు కున్నారు. నారాలోకేశ్‌కు 41 జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెనుకొండలోని తన వ్యక్తిగత కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి, అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంతకుమునుపు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోరంట్లలో, గడ్డం తండాలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి కుమారుడు సాయి కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మడకశి ర పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి కేక్‌కట్‌చేశారు. నారాలోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మడకశిరలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బైక్ ర్యాలీ నిర్వహించారు ఛత్రం పంచాయతీలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉన్న తులసీధామ వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్‌చేశారు. వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అగళిలో జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గుడిబండ, రొద్దం, అమరాపురం, రొళ్ల తదితర మండలాల్లో నారాలోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.



మడకశిరలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న



గోరంట్లలో టీడీపీ నాయకులు..



అగళిలో జడ్పీటీసీ ఉమేష్..

నామమాత్రంగా బడ్జెట్ సమావేశం

మడకశిరటౌన్, జనవరి 23: మడకశిర నగర పంచాయతీ అభివృద్ధి కోసం ఏడాది పాటు చేపట్టే పనులకు సంబంధించి నిధుల కేటాయింపుపై జరగాల్సిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించి, ముగించారు. నగరపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు ఏడాదిపాటు ఏమేరకు నిధులు ఖర్చు పెట్టాలి, ఏ పనులకు ఎంతమేరకు ఖర్చుపెట్టాలి, నగర పంచాయతీ పరిధిలో ఆదాయం తదితర వాటిపై సుదీ ర్ఘంగా చర్చ సాగాల్సి ఉంది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశాన్ని తూతూ మంత్రంగానే ముగించారు. కేవలం గంట లోపే సమావేశం ముగిసిపోయింది. ఏ అంశంపైన కూడా సుదీర్ఘంగా చర్చ సాగలేదు. 17వ వార్డు కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర మాట్లాడుతూ... నాగన్నకుంట కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈ అంశాన్ని బడ్జెట్‌లో పొందుపరిచి ఆమోదించాలని పట్టుపట్టారు. మిగిలిన సభ్యులు ప్రత్యేకం గా ఏఅంశంపైనా చర్చ లేవనెత్తలేదు. నగర పంచాయతీ పరిధిలో 2023-24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనా రూ.7.90కోట్లుగా, 2024-25 సంవత్సరానికి రూ.8.76కోట్లుగా బడ్జెట్ అంచనా ప్రతిపాదనలు చేశారు. ప్రత్యేకంగా ఎలాంటి పనులకు ఎంత బడ్జెట్ కేటాయించాలనే దానిపై మాత్రం స్పష్టంగా చర్చ జరగలేదు. ఈ సమావేశంలో మడకశిర నగర పంచాయతీ కమిషనర్ ప్రభాకర్‌రావు, చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువగళం వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో ప్రారంభం నుంచి ముగిసే వరకు పాల్గొన్న ఇద్దరు యువకులను ఘ నంగా సత్కరిం చారు. పెనుకొండ పట్టణానికి చెందిన విష్ణువికాస్ రాయల్, మండంలోని రొప్పాలకు చెందిన రాజేష్‌చౌదరి అనే యువకులు... నారా లోకేశ్ పాదయాత్రలో కుప్పం నుంచి విజయనగరంలో యాత్ర ముగిసేవరకు ఆయన వెంటే ఉండి వలంటీర్లుగా పనిచేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. దీంతో నారాలోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారిని మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సత్కరించారు. టీడీపీ నాయకులు వెంకటరాముడు, కేశవయ్య, సర్పంచ్ శ్రీనివాసులు, కన్వీనర్లు సిద్దయ్య, రవికుమార్, శశిభూషణ్, శ్రీనివాసులు తదితరులు, పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

24గంటల్లోగా బంకులను తొలగించండి

మున్సిపల్ అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ రూరల్, జనవరి 23 : పట్టణసమీపంలోని ఆర్అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న బంకులను 24గంటల్లో తొలగించకపోతే సస్పెండ్ చేస్తానని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మునిసిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పెనుకొండ నగరపంచాయతీ తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో పాత జాతీయ రహదారి పక్కన వైసీపీ కౌన్సిలర్లు, చైర్మన్‌తో పాటు ఓడిపోయిన కౌ న్సిలర్లు మొత్తం 24మంది ఎంతో విలువైన 45సెంట్ల ప్రభుత్వ భూమిలో అను మతులు లేకుండా 24బంకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 9న ఖాళీ స్థలంలో కబ్జాయేనా అని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం తహసీల్దార్ సురేష్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌తో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించారు. 24గంటల్లో బంకులు తొలగించకపోతే సస్పెండ్ చేస్తామని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై కమిషనర్‌ను వివరణ కోరగా 24గంటల్లో అక్రమంగా వేసుకున్న బంకులను తొలగింపజేస్తామన్నారు.

రాజవంతి పంచాయతీ అధ్యక్షురాలిగా నేత్రావతి



నూతన అధ్యక్షురాలిని అభినందిస్తున్న పంచాయతీ సభ్యులు

పావగడ, జనవరి 23: తాలూకా పరిధిలోని రాజవంతి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా జేడీఎస్ పార్టీకి చెందిన నేత్రావతి విజయం సాధించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా జేడీఎస్ పార్టీ నుంచి నేత్రావతి, కాంగ్రెస్ పార్టీ నుంచి సుబ్బరాయప్ప నామినేషన్లను దాఖలు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగిన ఎన్నికల్లో నేత్రావతికి 11 ఓట్లు, సుబ్బరాయప్పకు 7 ఓట్లు వచ్చాయి. దంతో నాలుగు ఓట్ల తేడాతో నేత్రావతి గెలుపొందినట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరద రాజు ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా గతంలో ఉన్న రాధమ్మ కొనసాగుతుండగా నూతనంగా ఎన్నికైన నేత్రావతిని జేడీఎస్ నాయకులు ఆర్‌సీ అంజినప్ప, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు రవి, జేడీఎస్ నాయకులు నేత్రావతిని అభినందించారు. పంచాయతీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షురాలు నేత్రావతి తెలియజేశారు.

రక్తదానం

హిందూపురం అర్బన్, జనవరి 23: రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడుదామని శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు చలపతి జన్మదినాన్ని పురస్కరించుకొని ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ సేవకు శివాజీ మహారాజ్ ఎంతగానో కృషి చేశారని, ఆయన అడుగు జాడల్లో యువత పయనించాలన్నారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో రోగులుకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్ బంగారు చంద్ర, అశ్వత్థనారాయణ స్వామీజీ, జగదీష్, బజరంగదళ్ నవీన్, రామాంజనేయులు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

'దేశం మరువని మహనీయుడు నేతాజీ'

హిందూపురం, జనవరి 23 : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్‌వారిపై పోరాడిన దేశం మరవని మహనీయుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌అని టీడీపీ నాయకులు కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు కేశవయ్య, పాలడుగు చంద్ర, పోతిరెడ్డి, తోటగేరి శీన, కన్నాస్వామి, రియాజ్, చంద్రమౌళి, పెద్దన్న, నారాయణనాయక్, కన్నా, బోయ అనీల్, దోణి లక్ష్మీనారాయణ, షీప్‌ఫారం చంద్ర, శీన, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మిట్ట ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



పురంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



స్ట్రాంగ్‌రూమ్ భద్రతపై ఆరాతీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ, జనవరి 23: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం కోసం పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం రాత్రి పరిశీలించారు. ఆయన రాత్రి 9గంటల సమయంలో సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి పరిశీలించారు. వారివెంట తహసీల్దార్ సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జనవరి 23: మడకశిర నియోజకవర్గంలో రోజు రోజుకూ తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు వైసీపీ నాయకులు పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. పార్టీలోకి చేరిన వారికి గుండుమల కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మండల పరిధిలోని చాపార్లపల్లికి చెందిన బాలకృష్ణ, పట్టణానికి చెందిన నాగరాజు, హనుమంతరాయప్ప, వారి వారి అనుచరులతో పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, మండల కన్వీనర్ లక్ష్మీ నారాయణ, కురుబ సంఘం నాయకుడు గోవిందప్ప, తెలుగు యువత నాయకులు తిమ్మరాజు, మారుతీరెడ్డి, నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సర్వర్ సమస్య

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



గొల్లపల్లి లో రాత్రి 7 గంటల వరకు సర్వే చేస్తున్న సిబ్బంది

మడకశిర రూరల్, జనవరి 23 : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా చేపడుతున్న కులగణన కార్యక్రమానికి సర్వర్ సమస్య ఎదురవుతుండడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కులగణన కోసం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటుచేశారు. దీని ద్వారా ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలను నమోదు చేయాలి. ఈ సర్వే బాధ్యత లను గ్రామ సచి వాలయ సిబ్బంది, వలంటీర్లకు అప్పజెప్పారు. సర్వర్ సమస్యతో ఇంటింటా సర్వే ముందుకు సాగడంలేదు. ఈ నెల 28లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో సచివాలయ సబ్బంది రాత్రి 7 గంటల వరకు గ్రామాల్లో సర్వేచేస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో పరిస్థితి ఇక చెప్పనకరలేదు. మండలపరిధిలోని భక్తరహళ్లి గ్రామ సచివాలయ సిబ్బంది మంగళవారం గొల్లపల్లిలో సర్వే చేపట్టారు. సర్వర్ సమస్య ఉండడంతో రాత్రి 7 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు.

నేడు రెండు గ్రామాల్లో

జనసభలు

పావగడ, జనవరి 23: ప్రజల వద్దకే పాలన కార్యక్రమంలో భాగంగా నాగలమడక, ర్యాప్టే గ్రామ పంచాయతీల్లో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జన సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వరదరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు సమస్యలపై ప్రజలు తహసీల్దార్, ఈఓ కార్యాలయాలకు వస్తున్నారని, అధికారులు కొన్ని సందర్భాల్లో అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను అక్కడే పరిష్కరించడానికి ఈ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ఉదయం 11 గంటలకు రాప్టా పంచాయతీలో, మధ్యాహ్నం 3 గంటలకు నాగలమడకలో జన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత న్యాయసేవాసదస్సు

పెనుకొండ రూరల్, జనవరి 23: మండలంలో చంద్రగిరిలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత న్యాయసేవ సదస్సు నిర్వహించినట్లు దుర్గాశక్తి సొసైటీ సీఈఓ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల్యవివాహాలు, మహిళ నిర్ణయాధికారం తదితర అంశాలపై నాటికరూపంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహాశక్తి ప్రోగ్రాం మేనేజర్ సుకన్య, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.